సాక్షి
నిర్మల్
మంగళవారం : 27 : మే : 2025



పంటమార్పిడితోనే ఫలితం

ఒకే రకమైన పంటల సాగుతో దిగుబడి ఏటా తగ్గుతోంది. పంట మార్పిడితో ప్రయోజనం పొందవచ్చని శాస్త్రవేత్త రాజశేఖర్ తెలిపారు. 8లో▸



స్మార్ట్ బజార్ 8లో▸

ప్రస్తుత మార్కెటింగ్ రంగంలో ఈ-కామర్స్ సంస్థలు నిత్యావసరాల నుంచి ఎలక్ట్రానిక్ ఉపకరణాల వరకు ఇంటికి చేర్చే సౌలభ్యాన్ని అందిస్తున్నాయి.

గరిష్ఠం/కనిష్ఠం
31.5 /26.3

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తగ్గుతాయి. అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని చాలా చోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజల భద్రత కోసమే పోలీసులు



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాశ్‌కుమార్

భైంసారూరల్: ప్రజల భద్రత కోసమే పోలీసులు పనిచేస్తున్నారని భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ అన్నారు. ఎస్పీ జానకీ షర్మిల ఆదేశాల మేరకు సోమవారం మండలంలోని మిర్జాపూర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని 62 ద్విచక్ర వాహనాలు, 3 ఆటోలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. యువత గంజాయి, మద్యం, డ్రగ్స్‌కు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయిని విక్రయించినా, రవాణా చేసిన పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమస్యలుంటే 100కు కాల్ చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భైంసారూరల్ సీఐ నైలు, కుభీర్ ఎస్సై రవీందర్, పోలీసులు పాల్గొన్నారు.

నేడు బాసర ఆలయ హుండీ లెక్కింపు

బాసర: బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారికి భక్తులు మొక్కుల రూపంలో సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం ఉదయం 9 గంటలకు ఆలయ ప్రాంగణంలో లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వాణాధికారి సుధాకర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయ అధికారులతో పాటు భక్తులు, స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొననున్నారు.

103 మంది గైర్హాజరు

నిర్మల్ రూరల్: జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో 103 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో పరశురాం తెలిపారు. ఫస్టియర్‌లో 1,434 మందికి గానూ 1,359 మంది హాజరుకాగా 75 మంది గైర్హాజరయ్యారు. ఇందులో జనరల్ కేటగిరీలో 1,249 మందికిగానూ 1,181 మంది హాజరుకాగా 68 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 185 మందికిగానూ 178 మంది హాజరుకాగా ఏడుగురు గైర్హాజరయ్యారు. సెకండియర్‌లో 447 మంది విద్యార్థులకు గానూ 419 మంది హాజరుకాగా 28 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరిలో 387 మందికిగానూ 360 మంది హాజరుకాగా 27 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో 60 మందికిగానూ 59 మంది హాజరుకాగా ఒకరు గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

వృత్తి నైపుణ్య శిక్షణ

నిర్మల్ రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివి నిరుద్యోగులుగా ఉన్న పూర్వ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇవ్వనున్నట్లు గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ అలుగు వర్షిని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2017 నుంచి ఇప్పటి వరకు పదో తరగతి, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి ఉన్నత చదువులు అభ్యసించలేని స్థితిలో ఉన్న నిరుద్యోగులకు గురుకుల విద్యా సంస్థ ఉన్నతి ఫౌండేషన్ సహకారంతో శిక్షణ ఇస్తున్నామన్నారు. 18 నుండి 25 సంవత్సరాల వయసు గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజు మూడు గంటల పాటు 30 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు 7036826353 నంబర్‌లో సంప్రదించాలని ఆమె సూచించారు.

అసైన్డ్‌భూమిని కబ్జా నుంచి కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లెలో అన్యాక్రాంతమవుతున్న అసైన్డ్‌భూమిని కబ్జా నుంచి కాపాడి ఇళ్లు లేని పేదలకు పంపిణీ చేయాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్, సహాయ కార్యదర్శి ఎల్ఆర్ ఉపాలి సోమవారం తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోసంపల్లె గ్రామాన్ని ఆనుకుని ఉన్న పీపీల్యాండ్‌ను కొందరు వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకుని అక్రమ నిర్మాణాలు చేస్తున్నారన్నారు. ఇలాంటి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని కోరారు. లేనిపక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బూక్యా రమేశ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఫేక్ సర్టిఫికెట్లు!



ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఫేక్ సర్టిఫికెట్లు పెట్టి, అధికారులనే తప్పుదోవ పట్టించినట్లు ఆరోపణలు, ఫిర్యాదులు వస్తున్నాయి. ఇటీవల మామడ మండలంలో పనిచేసే ఓ ఉద్యోగినిపై ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సదరు ఉద్యోగిని వైకల్య కోటాలో తప్పుడు సర్టిఫికెట్లు పెట్టినట్లు పలు సాక్ష్యాలతో అందులో ఆరోపించారు. ఈ మేరకు కలెక్టర్ అభిలాష అభినవ్ విచారణకు ఆదేశించారు. భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి ఈ ఫిర్యాదుపై విచారణ చేపడుతున్నారు. మరోవైపు విద్యాశాఖలోనూ తాజా డీఎస్సీలో పలువురు ఫేక్ సర్టిఫికెట్లు పెట్టి ఉపాధ్యాయ పోస్టుల్లో నియమితులైనట్లు ఆరోపణలు ఉన్నాయి. స్పెషల్ టీచర్ల పోస్టుల్లోనూ అక్రమాలకు పాల్పడినట్లు ఫిర్యాదులు వచ్చాయి. వీటిపై పలువురు కోర్టుకూ వెళ్లారు. – నిర్మల్

- జిల్లాలో తప్పుడు పత్రాలతో పోస్టులు
- విద్యాశాఖలోనూ అనుమానాలు
- ఇటీవల ప్రజావాణిలో ఫిర్యాదులు
- విచారణకు ఆదేశించిన కలెక్టర్

వైకల్యం పేరిటే..

చాలా వరకు ఫేక్ సర్టిఫికెట్లు వైకల్యం పేరిటే తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉద్యోగ నియామకాల్లో దివ్యాంగులకు ప్రత్యేక కోటా ఉండటంతో ఈ రూటులో పోస్టులను కొట్టే ప్లాన్లు చేస్తున్నారు. దివ్యాంగుల పింఛన్ల కోసమూ చాలామంది ఫేక్ సర్టిఫికెట్లు పెట్టినట్లు అప్పట్లో ఆరోపణలు వెల్లువెత్తాయి. తాజాగా చేసిన ఆరోపణల్లోనూ వైకల్యం పేరిటనే ఒకే కుటుంబానికి చెందిన పలువురు ఉద్యోగాల్లో నియమితులైనట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ కుటుంబంతో పాటు పలువురికీ ఫేక్ సర్టిఫికెట్లు ఇచ్చినట్లు అనుమానాలు ఉన్నాయని ప్రజావాణిలో ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మీడియంతో సంబంధం లేకుండా..

డీఎస్సీ–2024 ద్వారా జిల్లాలో చేపట్టిన నియామకాల్లోనూ అవకతవకలు చోటు చేసుకున్నాయి. విద్యార్థి దశ నుంచి ఎక్కడా తెలుగు మీడియంతో, తెలుగుభాషతో సంబంధం లేని అభ్యర్థికి సదరు పోస్టును ఇవ్వడం వివాదాస్పదమైంది. ఇతర మాధ్యమంలో, ఇతర భాషను సెకండ్ లాంగ్వేజ్‌గా చదివిన అభ్యర్థికి తెలుగు ఉపాధ్యాయురాలిగా నియమించడంపై తరువాతి స్థానాల్లో ఉన్న అభ్యర్థులు కోర్టుకు వెళ్లారు. ఇదే డీఎస్సీలో స్పెషల్ టీచర్ల ఎంపికలోనూ అధికారులు తప్పిదాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికీ సందేహాలు ఉన్నా.. వాటిపై స్పందించేవాళ్లు లేరంటూ బాధితులు వాపోతున్నారు.

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు సైతం..

జిల్లాలో జనన, మరణ ధ్రువీకరణపత్రాలనూ డూప్లికేట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆధార్‌కార్డుల్లో పేర్ల మార్పు, ఆస్తుల వ్యవహారాలు, తదితర పనులకు జనన, మరణ ధ్రువపత్రాలు తప్పనిసరి. ఈక్రమంలో ఫేక్ సర్టిఫికెట్లు రూపొందించి తమ పనులను చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గతంలో నిర్మల్ మున్సిపాలిటీలో ఆస్తిపన్నులకు సంబంధించి ఫేక్ బిల్లుల రసీదులు ఇచ్చిన వారిపై కేసులూ నమోదయ్యాయి. తాజాగా మరోసారి జిల్లాలో ఫేక్ సర్టిఫికెట్లపై ఆరోపణలు వస్తుండటంతో కలెక్టర్ సీరియస్‌గా తీసుకుని విచారణకు ఆదేశించారు.

విచారణ చేపడుతున్నాం..

కలెక్టర్ ఆదేశాల మేరకు ఫేక్ సర్టిఫికెట్ల ఫిర్యాదుపై విచారణ చేపడుతున్నాం. త్వరలోనే పూర్తి వివరాలు తెలుస్తాయి.
– కోమల్‌రెడ్డి, ఆర్డీవో, భైంసా

ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

- కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌టౌన్: ప్రజా సమస్యలు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ స్వయంగా అర్జీలు స్వీకరించారు. రైతు రుణమాఫీ, భూ సమస్యలు, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, విద్య, వైద్యం, తదితర అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును సంబంధిత అధికారులు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

దరఖాస్తులు పరిశీలించాలి

రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించిన దరఖాస్తులను త్వరగా పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తరచూ తనిఖీ చేయాలని, వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా చూడాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులపై వైద్యశాఖ ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీవో రత్నకళ్యాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ ఇస్తలేరు సారూ..



తల్లి సహాయంతో ప్రజావాణికి వస్తున్న షేక్ నైమా

నిర్మల్ మండలానికి చెందిన షేక్‌నైమా పుట్టుకతోనే బుద్ధిమాంద్యం, అంగ వైకల్యంతో బాధపడుతోంది. 13 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఇప్పటి వరకు దివ్యాంగుల పెన్షన్ రావడంలేదు. తన తల్లి సహాయంతో పలుమార్లు జిల్లా కార్యాలయాల చుట్టూ తిరిగిన ఫలితం లేకపోవడంతో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగానికి వచ్చి కలెక్టర్‌కు తన గోడు వెల్లబోసుకుంది. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలి



ఖానాపూర్ మండలం పాత తర్లపాడు గ్రామ శివారులోని 113 సర్వేనంబర్‌లో 1990లో ప్రభుత్వం 19 మంది రైతులకు ఒక్కొక్కరికి రెండెకరాల చొప్పున కేటాయించి పట్టాలు కూడా ఇచ్చింది. ఇట్టి భూమిని సాగుచేసుకుంటున్నాం. ఇది అటవీ శాఖ భూమి అంటూ అధికారులు వ్యవసాయ పనులు చేపట్టిన ప్రతీసారి పనులకు ఉపయోగించే ట్రాక్టర్లు, జేసీబీలను సీజ్‌చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్, సంబంధిత అధికారులు స్పందించి మా వ్యవసాయ భూమిలో ఎలాంటి ఆంక్షలు విధించకుండా చర్యలు చేపట్టి మా నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలి.
– పాత తర్లపాడు గ్రామ రైతులు

మార్కెట్ తరలించాలి



పట్టణంలోని గాంధీ కూరగాయల మార్కెట్‌లో రోడ్లపై వ్యాపారాలు చేయడం వల్ల ఇంద్రనగర్ కాలనీకి వెళ్లడం కష్టంగా మారింది. ఇంద్రనగర్ నుండి విశ్వేశ్వరయ్య మార్గ్ వెళ్లే దారిలో మెయిన్ రోడ్డుపై ఉన్న డివైడర్ కటింగ్‌ను ఈ కూరగాయల మార్కెట్ వల్ల మూసివేశారు. దీనిని తిరిగి తెరిపించాలి. ఈ విషయంపై కలెక్టర్ చొరవ తీసుకొని సత్వరమే మార్కెట్‌ను మరో చోటుకు తరలించాలి.
– ఇందిరానగర్ కాలనీవాసులు, నిర్మల్

ధాన్యం త్వరగా కొనుగోలు చేయాలి



వెంగ్వాపేట్‌లోని కొనుగోలు కేంద్రానికి వరి ధాన్యం తరలించి 30 రోజులు కావస్తున్నా ఇప్పటికీ కొనుగోలు చేయడం లేదు. అధికారులు త్వరగా స్పందించి ధాన్యం కొనుగోలు చేసి లారీల్లో తరలించాలి. లేదంటే కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చే ప్రమాదం ఉంది. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి. – వెంగ్వాపేట్ గ్రామ రైతులు

నా భర్త ఉద్యోగం ఇప్పించాలి



ఎస్‌డీసీఎల్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న నా భర్త కృష్ణకాంత్ గతేడాది మృతి చెందాడు. నాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నా భర్త మృతి చెందడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. కలెక్టర్‌గారు మానవతా దృక్పథంతో ఆలోచించి నా భర్త ఔట్ సోర్సింగ్ ఉద్యోగం నాకు ఇప్పించాలని వేడుకుంటున్నా.
– ఎస్.కల్పన, ఎల్లపెల్లి, నిర్మల్

విద్యార్థుల సంఖ్య పెంచాలి



మాట్లాడుతున్న డీఈవో రామారావు

కుభీర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని డీఈవో రామారావు అన్నారు. సోమవారం మండలంలోని పల్సి ఉన్నత పాఠశాలలో గ్రామస్తులు, ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జూన్ 6 నుంచి బడి బాట కార్యక్రమం ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఆంగ్ల మాధ్యమం కావాలనుకునేవారు పాఠశాలల కమిటీ తీర్మానాలను పంపిస్తే మంజూరు చేస్తామన్నారు. పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన తైమిన్‌బేగం ఇంటికి వెళ్లి అభినందించారు. సమావేశంలో ఎంఈవో విజయ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సురేష్, గ్రామపెద్దలు హన్మాండ్లు, రమేశ్, ధర్మపురి, తదితరులు పాల్గొన్నారు.

‘భరోసా’ ఇంకెప్పుడు?



రాచాపూర్ వద్ద సిద్ధంగా ఉన్న పంటచేను

- ఇప్పటికీ ప్రకటన చేయని ప్రభుత్వం
- ఎదురుచూపుల్లో రైతులు
- అప్పులు తప్పవంటున్న అన్నదాతలు
- జిల్లాలో 4.20 లక్షల ఎకరాల్లో పంటలు సాగు

లక్ష్మణచాంద: పంటల సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇతర ఖర్చుల కోసం గతంలో రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తెచ్చి పంటలు సాగు చేసేవారు. దీంతో వడ్డీ చెల్లించలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రైతుల పంటల సాగుకు అవసరమైన పెట్టుబడి అందించి ఆదుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018లో రైతుబంధు పథకాన్ని ప్రవేశపెట్టింది. ఏడాదికి రెండు విడతల్లో ఎకరాకు రూ.10 వేలు రైతుల ఖాతాల్లో నగదు జమ చేసింది. ప్రస్తుత ప్రభుత్వం రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చింది. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ గత వానాకాలంలో ఎకరానికి కేవలం రూ.10 వేలు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేసింది.

సాగు పనులు షురూ

జిల్లాలో ఐదు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు సాగు పనుల్లో నిమగ్నం అయ్యారు. ఇప్పటికే పంట చేలలోకి నల్లమట్టి, పశువుల ఎరువు తరలించి పొలమంతా చల్లుతున్నారు. దుక్కులు దున్ని విత్తనాలు వేయడానికి పంటచేలను సిద్ధం చేస్తున్నారు.

4.20 లక్షల ఎకరాల్లో సాగు

జిల్లాలో ఈ ఏడాది వానాకాలం 4 లక్షల 20 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు కానున్నాయని జిల్లా వ్యవసాయాధికారులు ప్రణాళికలు రూపొందించారు. ఇందులో ప్రధానంగా సోయాబీన్ 1.10 లక్షల ఎకరాలు, వరి 1.20 లక్షల ఎకరాలు, పత్తి 1.50 లక్షల ఎకరాలు, మొక్కజొన్న 30 వేల ఎకరాలు, కంది 7 వేల ఎకరాలు, ఇతర పంటలు 3 వేల ఎకరాలలో సాగు కానున్నాయని జిల్లా వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

పెట్టుబడి సాయం రూ.275 కోట్లు

జిల్లాలోని 19 మండలాల పరిధిలోని 400 గ్రామాలకు చెందిన లక్షా 84 వేల మంది రైతులకు గానూ రైతు భరోసా కింద రూ.275 కోట్లు అన్నదాతల ఖాతాల్లో నేరుగా జమ కానున్నాయని డీఏవో అంజిప్రసాద్ పేర్కొన్నారు.

స్పష్టతలేని వైనం...

ఈ సారి ముందస్తుగానే రుతుపవనాలు వచ్చాయి. రాష్ట్రమంతా వర్షాలు కురుస్తున్నాయి. అన్నదాతలు వ్యవసాయ పనులు ప్రారంభించారు. కానీ రైతు భరోసాపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత రాలేదు. దీంతో రైతు భరోసా వస్తుందా? రాదా? అని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరగా స్పందించి రైతు భరోసాపై స్పష్టత ఇచ్చి ఖాతాల్లో నగదు జమచేసి ఆదుకోవాలని జిల్లా రైతులు కోరుతున్నారు.

ఆందోళన చెందుతున్నాం



రాష్ట్ర ప్రభుత్వం పంటల సాగుకు పెట్టుబడి సాయం అందించేందుకు ఇప్పటి వరకు రైతు భరోసాపై స్పష్టమైన ప్రకటన చేయడం లేదు. దీంతో విత్తనాలు, ఎరువులు ఎలా కొనుగోలు చేయాలో తెలియక ఆందోళన చెందుతున్నాం.
– సాయన్న, రైతు, పొట్టపెల్లి

ఆదేశాలు రాలేదు



రైతు భరోసా నిధుల గురించి ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వ నుంచి మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వం వద్ద రైతులకు సంబంధించిన అన్ని వివరాలు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే రైతుల ఖాతాల్లో నేరుగా జమ అవుతాయి.
– అంజిప్రసాద్, డీఏవో, నిర్మల్

నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలి



ఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న టీయూడబ్ల్యూజే సభ్యులు

నిర్మల్‌టౌన్: నకిలీ విలేకరులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) సభ్యులు సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిలకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలువురు నకిలీ విలేకరులుగా చలామణి అవుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీపీఆర్వో కార్యాలయంలో డీపీఆర్వో విష్ణుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి భూమయ్య, సభ్యులు మనోజ్, అశోక్, రవి, యోగేష్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



అభినయ



కీర్తన

నిర్మల్‌టౌన్: ఈ నెల 24 నుంచి 26 వరకు మంచిర్యాల ఎఫ్ఏసీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్, సబ్ జూనియర్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన ఏడుగురు పాల్గొని జాతీయస్థాయికి ఎంపికయ్యారు. ఇందులో పి.అభినయ (54–57), ఏ.కీర్తన (46–48), శ్రావణి (64–67) కేటగిరీలలో బంగారు పతకాలు సాధించగా నక్షత్ర కాంస్య పతకం సాధించింది. ఇందులో అభినయ, కీర్తన జూన్ 4 నుంచి 7 వరకు గోవాలో జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ అండర్–17 బాలికల బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్ జాతీయ స్థాయికి ఎంపికైన అభినయ, కీర్తనలను అభినందించారు. జాతీయస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిషోర్, జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

జొన్న కొనుగోళ్లు నిలిపివేత..



మాటేగాంలో జొన్నలు విక్రయించేందుకు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన రైతు

భైంసాటౌన్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాలు పలుచోట్ల మూసివేయడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ముధోల్‌కు చెందిన రాజేశ్వర్ రావు దేశాయ్ అనే రైతు జొన్నలు విక్రయించేందుకు ఈనెల 23న టోకెన్ తీసుకున్నాడు. వర్షాలు కురవడంతో కొనుగోలు కేంద్రం నిర్వాహకులు సోమవారం తీసుకురావాలని సూచించగా మాటేగాంలోని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చాడు. కేంద్రం మూసి ఉండడంతో నిర్వాహకులను ఫోన్‌లో సంప్రదించాడు. విషయం తెలుసుకున్న ‘సాక్షి’ అక్కడికి చేరుకుని మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా కుంటాలలోని కేంద్రానికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో సదరు రైతు కుంటాల కొనుగోలు కేంద్రంలో జొన్నలు విక్రయించాడు. ‘సాక్షి’ చొరవతో జొన్నలు కొనుగోలు చేయడంతో రైతు కృతజ్ఞతలు తెలిపాడు.

క్లుప్తంగా

లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిపై కేసు

నెన్నెల: మండలంలోని మైలారం గ్రామంలో ఓ వితంతువుపై లైంగిక వేధింపులకు పాల్పడిన గడ్డి భీరయ్యపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..ఈనెల 23న రాత్రి మహిళ ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకి చొరబడి చేయిపట్టి లాగి కోరిక తీర్చమంటూ లేదంటే చంపుతానని బెదిరించాడు. ఆమె కేకలు వేస్తూ తప్పించుకొని పారిపోయింది. సోమవారం బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని పిప్రికాలనీకి చెందిన పావడే లక్ష్మణ్(32) సోమవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై మహ్మద్ గౌసుద్దీన్ కథనం ప్రకారం.. మృతుడు లక్ష్మణ్ స్థానికంగా ఆటో నడుపుతూ ఉపాధి పొందుతున్నాడు. ఈక్రమంలో మద్యానికి బానిసగా మారగా, పలుమార్లు ఆత్మహత్యకు యత్నించాడు. సోమవారం ఉదయం సైతం ఇంటికి వచ్చి గదిలోకి వెళ్లి సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారమివ్వగా, వారు చేరుకుని మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. భార్య స్వప్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాజీ సర్పంచ్ కుటుంబ సభ్యులపై దాడి

చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆలోతు లక్ష్మిప్రియ, ఆమె కుటుంబ సభ్యులపై కొందరు స్థానికులతోపాటు వేరే గ్రామానికి చెందిన వారు దాడికి పాల్పడ్డారు. పాత కక్షలను మనస్సులో పెట్టుకుని సోమవారం ఆమె ఇంట్లో చొరబడి ఆమెతోపాటు కుటుంబ సభ్యులపై దాడి చేయడమే ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేశారు. ఈవిషయమై చెన్నూర్ పోలీసుస్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ రిపేర్ చేయలేదని షోరూంకి తాళం

నిర్మల్‌టౌన్: బైక్ రిపేర్ చేయలేదని కస్టమర్ ఓ షోరూంకు తాళం వేశాడు. జిల్లా కేంద్రంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మామడ మండలం సాంగ్వి గ్రామానికి చెందిన సాయన్న 10 నెలల క్రితం నిర్మల్‌లో ఎలక్ట్రిక్ బైక్ కొనుగోలు చేశాడు. అది రిపేర్ నిమిత్తం షోరూంకు శనివారం తీసుకువచ్చాడు. మూడు రోజులైనా రిపేర్ చేయకపోవడంతో ఆగ్రహించి సోమవారం సాయంత్రం షోరూంకు తాళం వేశాడు. ఈ విషయమై నిర్వాహకులు మాట్లాడుతూ స్థానికంగా సర్వీస్ సెంటర్ లేదన్నారు. మెకానిక్ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారని తెలిపారు. సాయన్న బైక్‌కు కావాల్సిన మెటీరియల్ హైదరాబాద్ నుంచి రావాలని, అందుకే ఆలస్యమవుతోందన్నారు. తాళం వేయడంపై పోలీసులను ఆశ్రయిస్తామన్నారు.

పిడుగుపాటుకు స్పృహ తప్పిన ఇద్దరు చిన్నారులు

దిలావర్‌పూర్: మండలంలోని గుండంపల్లిలో సోమవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతోపాటు పిడుగుపాటుకు ఇద్దరు చిన్నారులు స్పృహ తప్పారు. మహారాష్ట్రకు చెందిన రెండు కుటుంబాలకు చెందిన చిన్నారులు ఆకాశ్, జ్యోతి స్పృహతప్పి పడిపోగా కుటుంబీకులు నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పంటమార్పిడితోనే ఫలితం

- ఏళ్ల తరబడి ఒకే రకం పంటలు చేటు
- మార్పుతోనే మంచి దిగుబడి


దుక్కి దున్నుతున్న రైతు


రాజశేఖర్, శాస్త్రవేత్త

మంచిర్యాలఅగ్రికల్చర్: ఖరీఫ్‌సీజన్ మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. రుతుపవనాలు జూన్ మొదటి వారంలో జిల్లాలను తాకానున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. తొలకరి వర్షాలు పడేలోగా విత్తనాలు సమకుర్చుకునే పనిలో రైతులు సమయాత్తమవుతున్నారు. అయితే వారు గుర్తించుకోవాల్సిన ముఖ్య విషయమేమిటంటే.. ఒకే భూమిలో ఒకే రకమైన పంటను ఏళ్ల తరబడి పండిస్తూ దిగుబడి రాక అనేక సమస్యలు ఎదురువుతున్నాయి. చీడపీడల బెడద అధికమవడంతోపాటు భూమి నిస్సారమవుతుంది. పంట మార్పిడితో ప్రయోజనం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ సస్యరక్షణ శాస్త్రవేత్త రాజశేఖర్ పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో నల్లరేగడి నేలలు 70 శాతం, 20 శాతం ఎర్ర,10 శాతం చౌడు ఇసుక నేలలు ఉన్నాయి. అన్ని పంటలకు అనుకూలంగా నేలలు ఉన్న రైతులు పత్తి, సోయా, వరి పంటలను ఎనిమిదేళ్లుగా సాగు చేస్తున్నారు. దీని ద్వారా చీడపీడల ఉధృతి పెరుగుతుంది. భూసారం కోల్పోయి పంట దిగుబడి తగ్గి ఆర్థికంగా నష్టపోతున్నారు. పంట మార్పిడితో కొంతవరకు దిగుబడి పెంచుకుని నష్టాల నుంచి గట్టెక్కే ప్రయోజనం ఉంది.

పంట మార్పునకు..

పంట మార్పిడి చేయాలంటే అంతకుముందు వేసిన పంటకు భిన్నంగా ఎంచుకోవాలి. ఉదాహరణకు కొన్ని పంటలు వేరు వ్యవస్థలు భూమి నుంచి పోషకాలను గ్రహిస్తాయి. నువ్వులు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలు ఈ కోవలోకి వస్తాయి. అపరాల పంటలు కొంతవరకు పరిస్థితుల్ని కూడా తట్టుకుంటాయి. ఆకుల్ని రాల్చి భూమికి సేంద్రియ పదార్థాల్ని అందిస్తాయి. ఈ పంట వేరు బుడిపెలు నత్రజనిని స్థిరీకర్తిస్తాయి. నల్లరేగడి నేలల్లో నువ్వులు, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటలు పండించిన వారు సోయచిక్కుడు వేసుకుంటే మంచిది. ఈ పంట సమయానికి అకులు పూర్తిగా రాలిపోతాయి. తద్వారా ఎకరాకు 1 నుంచి 2 టన్నుల సేంద్రియ పదార్థం లభిస్తుంది.

ఎలాంటి పంట వేసుకోవాలి

గతేడాది రబీలో వేరుశనగ వేసిన రైతులు ఈ ఖరీఫ్‌లో మొక్కజొన్న వేసుకుంటే పంటకు నత్రజని లభిస్తుంది. ఫలితంగా రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించుకోవచ్చు. దీనివల్ల రాబోయే రబీలో మళ్లీ వేరుశనగ వేసినప్పుడు ఆ పంట నులిపురుగుల బెడద తగ్గుతంది. శనగ పంట వరుసగా వేసుకుంటే కాయతొలుచు పురుగుల తాకిడి ఉంటుంది. వీటి దాడి తక్కువగా ఉండే జొన్న, నువ్వులు, ఉలవ, మెట్ట వరి పంటలు వేసుకోవచ్చు. కంది, శనగ, పంటలతో పోలిస్తే మినుము, సోయ చిక్కుడు పంటలకు కాయతొలుచు పురుగుల తాకిడి తక్కువగా ఉంటుంది. వీటితో పంట మార్పిడి చేయవచ్చు. వరుసగా పొద్దుతిరుగుడు వేసుకున్నవారు దాని స్థానంలో కొర్ర, జొన్న, సజ్జ వంటి చిరుధాన్యపు పంటలు వేసుకోవాలి. దీనివల్ల నులిపురుగు తాకిడి తగ్గుతుంది. అనుప, కాకర, దోస, కర్బూజ, గుమ్మడి, పొట్ల, బీర, బూడిద గుమ్మడి, దొండ తీగజాతి కూరగాయల పంటల సాగు చేసినవారు వరితో పంట మార్పిడి చేసుకోవాలి.

ఏళ్లుగా పసుపు వేయొద్దు

ఒకసారి పసుపు వేసిన భూమిలో రెండేళ్లపాటు పసుపు సాగు చేయొద్దు. వరుసగా పసుపు వేసుకుంటే దిగుబడి తగ్గిపోతాయి. చీడపీడల దాడి అధికమవుతుంది. పసుపు వేసిన భూమిలో వరి, చెరుకు, అరటి పంటలు వేసుకుంటే ప్రయోజనం ఉంటుంది. పసుపు తర్వాత వరి, జొన్న వేసుకుంటే నులిపురుగుల ఉధృతి తగ్గుతుంది.

చీడపీడల నివారణకు..

కొన్ని రకాల పురుగులు, తెగుళ్లు, కొన్ని పంటల్ని అధికంగా ఆశించి వృద్ధి చెందుతాయి. అలాంటి పంటల్ని వరుసగా వేసుకోకుండా పంట మార్పిడి చేసుకోవాలి. ఉదాహరణకు ఒకే భూమిలో వరుసగా వరి వేయకుండా పప్పు ధాన్యపు పంటలు, నూనె గింజల పంటలు వేసుకోవాలి. మిరప, వేరుశనగ, క్యాబేజీ పంటల్ని లద్దె పురుగులు ఎక్కువగా ఆశించి నష్టపరుస్తాయి. వీటి ఉధృతిని అరికట్టేందుకు జొన్న, వరి, సజ్జ, రాగి, పొద్దుతిరుగుడు, అరుతడి పంటలతో పంట మార్పిడి చేయాలి. దీనివల్ల ఆయా పంటల్లో కాళహస్తి తెగులు, నులి పురుగులు, ఆకుముడత, లద్దె పురుగుల ఉధృతిని నివారించవచ్చు.

ముగిసిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు

- జిల్లాకు 15 మెడల్స్
- జాతీయస్థాయికి ఇద్దరు ఎంపిక


మెడల్స్‌తో మంచిర్యాల ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణ కేంద్రం క్రీడాకారులు

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్‌లో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి టైసన్ బాక్సింగ్ పోటీలు సోమవారంతో ముగిశాయి. 260 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఆద్యంతం ఆకట్టుకునేలా క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనతో అలరించారు. జిల్లా కేంద్రంలో కోచ్ రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఖేలో ఇండియా బాక్సింగ్ శిక్షణ కేంద్రం నుంచి 19 మంది పోటీల్లో పాల్గొనగా 9 గోల్డ్, 2 సిల్వర్, 4 బ్రాంజ్ మెడల్స్‌తో మొత్తం 15 మెడల్స్‌ను సాధించారు. గోల్డ్ మెడల్‌ను సాధించిన వారిలో ఏ.రక్షిత్, జి.రిశ్వంత్, ఎండీ ఉబేద్, క్రితి అగర్వాల్, బి.రుత్విక్ కుమార్, ఓ.సంస్కృతి, సీహెచ్.హాసిని, బి.అనుదీప్, ఎస్.షబ్మక్ తేజ ఉన్నారు. సిల్వర్ మెడల్ సాధించిన వారిలో పి.కార్తీక్, జి.శ్రీనాథ్, బ్రాంజ్ మెడల్ సాధించిన వారిలో ఎం. అశ్విత్, పురబ్ బిశ్వాస్, బి.అనురాగ్, సీహెచ్.జగదీశ్వర్ ఉన్నారు. వీరిని జిల్లా యువజనుల క్రీడల శాఖ అధికారి కీర్తి రాజ్‌వీరు అభినందించారు. జాతీయ స్థాయిలో వచ్చే నెల 3న గోవాలో జరిగే జాతీయస్థాయి బాక్సింగ్ పోటీలకు క్రితి అగర్వాల్, ఉబేద్ ఎంపికైనట్లు కోచ్ రాజేశ్ తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్ మోసం

నిర్మల్‌టౌన్: గల్ఫ్ ఏజెంట్ డబ్బులు తీసుకుని తనకు దుబాయ్ పంపించి చెప్పిన పనికాకుండా వేరే పని ఇప్పించి మోసం చేశాడని బాధితుడు వాపోయాడు. వివరాల్లోకి వెళ్తే..జిల్లాకేంద్రంలోని కూరన్నపేట్‌లో నివాసం ఉంటున్న శివశంకర్ భార్య యశోద ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తోంది. హాస్పిటల్‌కి గోవర్ధన్ చికిత్స కోసం వచ్చేవాడు. అలా శివశంకర్ భార్యతో పరిచయం పెంచుకున్నాడు. నీ భర్తను దుబాయ్ పంపిస్తానని, అధిక డబ్బులు సంపాదించుకోవచ్చని ఆమెను నమ్మించాడు. దీంతో వారు దుబాయ్‌లో హౌస్‌కీపింగ్ ఉద్యోగానికి రూ.63 వేలు ఏజెంట్‌కు ఇచ్చి ఒప్పంద పత్రం స్థానిక ఓ ట్రావెల్స్‌లో రాయించుకున్నారు. అనంతరం దుబాయ్ వెళ్లిన శివశంకర్‌ను ఇబ్బంది పెట్టారు. దీంతో ఇంట్లో వాళ్లకి ఫోన్‌చేసి జరిగింది చెప్పాడు. ఏజెంట్‌కు ఫోన్ చేస్తే స్పందించలేదు. భార్య వేరే వ్యక్తుల వద్ద అప్పుచేసి రూ.లక్ష వడ్డీకి తీసుకువచ్చి దుబాయ్‌కి పంపడంతో ఆయన అక్కడి నుంచి వచ్చాడు. ఇలా తప్పుడు పత్రాలతో మోసగించిన ఏజెంట్ గోవర్ధన్‌పై చర్యలు తీసుకుని మా డబ్బులు ఇప్పించాలని స్టేట్ ఎన్నారై అడ్వైజరీ కమిటీ మెంబర్ స్వదేశ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాకేంద్రంలో ఎస్పీ జానకీ షర్మిలకు వినతిపత్రం అందజేశారు.

ఇంట్లో గొడవపడి వెళ్లిన మహిళ అప్పగింత


కుటుంబీకులకు అప్పగిస్తున్న పోలీసులు

ఖానాపూర్: ఇంట్లో గొడవపడి వెళ్లిన మహిళను కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. పట్టణంలోని డబుల్ బెడ్రూం కాలనీలో వెడ్మ అనసూయ సోమవారం ఇంట్లో గొడవపడి వెళ్లిపోయిందని భర్త బారు, కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. ఎస్పీ ఆదేశాలతో నిర్మల్ ఐటీ కోర్ సిబ్బంది సహకారంతో లోకేషన్ ఆధారంగా కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో మహిళను గుర్తించామన్నారు. ఇరువురికి కౌన్సెలింగ్ ఇచ్చి మహిళను అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అక్రమ పత్రాలతో మోసం చేసిన ఉద్యోగి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సునీల్‌కుమార్

ఆదిలాబాద్‌టౌన్: అక్రమ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి మోసం చేసిన కేసులో ఓ ప్రభుత్వ ఉద్యోగిని వన్‌టౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో సీఐ సునీల్ కుమార్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన కొండూరి గంగాధర్ విద్యానగర్‌కు చెందిన సయ్యద్ రజాక్ సర్వే నం.346, ప్లాట్ నం.191 అటెండర్ కాలనీలో ప్లాట్ విక్రయించాడు. పదవిని దుర్వినియోగం చేసి సుమిత్రబాయి అనే అటెండర్ పేరుపై నకిలీ దస్తావేజులు తయారు చేసి బాధితుడికి విక్రయించాడు. సయ్యద్ రజాక్ ఈ ప్లాట్‌ను బ్రహ్మకంటి సత్యనారాయణకు విక్రయించగా, ఆయన నళినికి ప్లాట్‌ను అమ్మాడు. ఆమె బ్యాంక్ రుణం తీసుకుని ఇల్లు నిర్మించే క్రమంలో అక్కడికి వెళ్లి స్థల యజమాని తోట ఆశమ్మ అభ్యంతరం తెలిపింది. దీంతో మోసం వెలుగులోకి వచ్చింది. మొదట ప్లాట్ కొనుగోలు చేసిన సయ్యద్ రజాక్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, విచారణ చేపట్టారు. కొండూరి గంగాధర్ అక్రమంగా సుమిత్రబాయి సహకారంతో, ఆమెను బెదిరించి అక్రమ పత్రాలు సృష్టించినట్లు తేలిందని సీఐ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గంగాధర్ ప్రస్తుతం జెడ్పీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవల ఈ వ్యవహారానికి సంబంధించి బాధితుడు అధికారులకు ఫిర్యాదు చేశాడు. కలెక్టర్ విచారణకు ఆదేశించారు. జెడ్పీ సీఈఓ జితేందర్ రెడ్డి విచారణ చేపట్టి అక్రమాలు జరిగినట్లుగా నిర్ధారిస్తూ కలెక్టర్‌కు నివేదిక అందజేశారు. దాని ఆధారంగా గంగాధర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాజర్షిషా ఉత్తర్వులు జారీచేశారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా


అర్జీలు స్వీకరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల అర్జీలు సత్వరం పరిష్కరించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి లో తమ సమస్యలు పరిష్కరించాలని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి అర్జీలను పీవో స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం 119 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. ఆయా అర్జీలను శాఖల అధికారులు పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఏవో దామోదరస్వామి, మేనేజర్ శ్యామల, డీపీవో ప్రవీణ్, జేడీఎం నాగభూషణం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- ఉట్నూర్ మండలం శ్యాంపూర్ గ్రామానికి బోర్‌వెల్ సౌకర్యం కల్పించాలని గిత్తే మనోహర్ దరఖాస్తు అందించాడు.
- తలమడుగు మండలం రేకులగూడ గ్రామానికి రోడ్లతోపాటు ఇళ్ల సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు విన్నవించారు.
- ఆదిలాబాద్ మండలం అంకోలి గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ తనకు ఏదైనా ఉద్యోగం ఇప్పించాలని వేడుకున్నాడు.
- కడెం మండలం ఉడుంపూర్ గ్రామానికి చెందిన ఆత్రం మాణిక్‌రావు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని కోరాడు.

రోడ్డుప్రమాదంలో యువకుడి మృతి


రాహుల్(ఫైల్)

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లె గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం.. కడెం మండలం లింగాపూర్‌కు చెందిన నీరేటి రాహుల్ (19) ఆదివారం రాత్రి జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలం ఓబులాపూర్‌కు బైక్‌పై పండుగ నిమిత్తం వెళ్లి తిరిగివస్తున్నాడు. ఖానాపూర్ మండలం గోసంపల్లె పొలిమేరలో చెట్టును ఢీకొని తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. బైక్‌పై ఉన్న మరో యువకుడు జక్కుల కార్తీక్‌కు సురక్షితంగా బయటపడ్డాడు. యువకుడి అతి వేగం, అజాగ్రత్తగా వాహనాన్ని నడపడంతో ప్రమాదం చోటు చేసుకుందని ఎస్సై తెలిపారు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి మృతి


విష్ణుతేజ (ఫైల్)

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అంకుశాపూర్ గ్రామానికి చెందిన గొత్రే విష్ణుతేజ(12) విద్యార్థి చికిత్సపొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో విష్ణుతేజ 7వ తరగతి చదువుతున్నాడు. సెల్‌ఫోన్ కొనివ్వాలని తల్లిదండ్రులతో గొడవ పెట్టుకుని నెలరోజుల క్రితం పురుగుల మందు తాగాడు. హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసినట్లు రూరల్ సీఐ తెలిపారు.

మేకల మందపై చిరుత దాడి


గాయపడ్డ మేక

నర్సాపూర్ (జి): మండలంలోని రాంపూర్ అనుబంధ దర్యాపూర్ గ్రామశివారులోని అటవీ ప్రాంతంలో మేకల మందపై సోమవారం సాయంత్రం చిరుత పులి దాడి చేసింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఎరుకల శ్రీకాంత్ మేకలను అటవీ ప్రాంతంలోకి తీసుకెళ్లాడు. మేకలు మేస్తుండగా చిరుత ఒక్కసారిగా మందపై దాడిచేసింది. ఈ ఘటనలో ఓ మేక మేక గాయపడింది. ఈమేకు బాధితుడు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాడు. అటవీ ప్రాంతంలో చిరుత పులి సంచరిస్తున్నందున పశువులు, మేకల కాపరులు అప్రమత్తంగా ఉండాలని అటవీఅధికారులు సూచించారు.

స్మార్ట్ బజార్

- నెట్టింట్లో ఆర్డర్.. నట్టింటికే సరుకులు
- మార్కెటింగ్ రంగంలో ఆధునిక విప్లవం..
- విస్తరిస్తున్న ఆన్‌లైన్ మార్కెట్..
- ఉమ్మడి జిల్లాలో విస్తరిస్తున్న ఈ-కామర్స్
- నేడు ప్రపంచ మార్కెటింగ్ దినోత్సవం



నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుత మార్కెటింగ్ రంగం రోజురోజుకూ కొత్త ఒరవడిని సంతరించుకుంటూ వినియోగదారులను ఆకర్షిస్తోంది. గతంలో షాపింగ్ కోసం మార్కెట్‌కు వెళ్లి వస్తువులు కొనుగోలు చేసే సంప్రదాయం ఉండేది. కానీ, నేడు ఈ-కామర్స్ సంస్థలు ఇంటి నుంచి అడుగు బయటపెట్టకుండానే నిత్యావసరాల నుంచి ఎలక్ట్రానిక్ ఉపకరణాల వరకు అన్నింటినీ ఇంటికి చేర్చే సౌలభ్యాన్ని అందిస్తున్నాయి. మంగళవారం ప్రపంచ మార్కెటింగ్ దినోత్సవం సందర్భంగా ఈ-కామర్స్ సంస్కృతిపై ప్రత్యేక కథనం.

ఆన్‌లైన్ షాపింగ్ జోరు

గతంలో నగరాలు, పట్టణాలకే పరిమితమైన ఆన్‌లైన్ కొనుగోళ్లు ఇప్పుడు గ్రామాలు, మారుమూల తండాలకు విస్తరించాయి. నిత్యావసరాలు, బట్టలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, పాదరక్షలు అన్నీ మొబైల్ ద్వారా ఆర్డర్ చేసి ఇంటికి తెప్పించుకుంటున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరూ ఈ సౌలభ్యాన్ని వినియోగించుకుంటున్నారు. ఈ- కామర్స్ సంస్థల విస్తృత నెట్‌వర్క్, సులభమైన డెలివరీ వ్యవస్థ ఈ ట్రెండ్‌ను వేగవంతం చేసింది.

ఉపాధి అవకాశాలు

ఉమ్మడి జిల్లాలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, మీషో వంటి సంస్థలు ఏజెన్సీలు, కొరియర్ కార్యాలయాలను ఏర్పాటు చేశాయి. స్థానిక యువత డెలివరీ సిబ్బందిగా ఉపాధి పొందుతూ వినియోగదారులకు నేరుగా వస్తువులను అందజేస్తున్నారు. ఈ వ్యవస్థ గ్రామీణప్రాంతాలకు కూడా సేవలను అందిస్తూ స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోంది. 'స్మార్ట్ నిర్మల్'యాప్ ద్వారా నచ్చిన రెస్టారెంట్ నుంచి ఫుడ్‌ను జిల్లావాసులు ఆర్డర్ చేసి తెప్పించుకుంటున్నారు. ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్ల సమన్వయంతో శాఖాహార, మాంసాహార ఐటమ్స్‌ను సిబ్బంది నేరుగా ఇంటి వద్దకే డెలివరీ చేస్తున్నారు. కాగా, ఆన్‌లైన్‌లో వస్తువుల కొనుగోలుతో స్థానిక వ్యాపారులకు కొంత నష్టం జరుగుతుందని, వారిని ప్రోత్సహించాలని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

యువత ఆధిపత్యం

మొబైల్ ఫోన్‌ను విరివిగా వినియోగించే యువత ఈ-కామర్స్ సేవలను ఎక్కువగా ఉపయోగిస్తోంది. ఫ్యాషన్ వస్తువులు, ఎలక్ట్రానిక్ ఉపకరణాల నుంచి ఆహార పదార్థాల వరకు వారు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తున్నారు. గృహిణులు కూడా నిత్యావసరాలు, బట్టలు, గృహ సామాగ్రి కొనుగోలుకు ఈ-కామర్స్ వేదికలను ఆశ్రయిస్తున్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్లలో తప్పుడు వెబ్‌సైట్‌లు, మోసపూరిత లావాదేవీల నుంచి జాగ్రత్తగా ఉండాలి. విశ్వసనీయ సంస్థలను ఎంచుకోవడం, ముందస్తు చెల్లింపుల విషయంలో అప్రమత్తంగా ఉండటం అవసరం. పిన్‌కోడ్, చిరునామా, మొబైల్ నంబర్ వంటి వివరాలను సురక్షిత వెబ్‌సైట్లలోనే నమోదు చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

బయటకు వెళ్లలేకనే..



బయటకు వెళ్లి షాపింగ్ చేసే సమయం లేదు. ఇంట్లో ఉండి నిత్యావసరాలు తదితర వస్తువులను ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేస్తుంటాను. డెలివరీ తర్వాత వస్తువు డ్యామేజ్ ఉన్నా రిటర్న్ చేసే అవకాశం ఉంది. కాలానికనుగుణంగా ఈ కామర్స్ షాపింగ్ మంచి వేదికగా మారుతోంది.

\- లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రభుత్వ ఉద్యోగి, నిర్మల్

స్థానిక మార్కెట్‌పై ప్రభావం



అరచేతిలో సెల్‌ఫోన్ ఉండడంతో ఆన్‌లైన్ షాపింగ్‌కు ఆసక్తి పెరుగుతోంది. ఈ కామర్స్ వ్యాపారం క్రమంగా పల్లెలకు విస్తరించడంతో స్థానిక మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతుంది. నిర్మల్ మార్కెట్ ప్రస్తుతం పండుగ సీజన్లో వెలవెలబోతోంది. స్థానిక వ్యాపారులకు వర్తకం జరిగేలా ప్రోత్సహించాలి.

\- పోల దయాకర్, వస్త్ర వ్యాపారి, నిర్మల్

నకిలీ పత్రాలు సృష్టించిన నిందితుడి అరెస్ట్

ఆదిలాబాద్‌రూరల్: భూ దస్తావేజుల మోసం, నకిలీపత్రాలు సృష్టించిన పాత హౌజింగ్‌బోర్డు కాలనీకి చెందిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి సజ్జనపు లక్ష్మీనారాయణను అరెస్టు చేసినట్లు మావల సీఐ స్వామి తెలిపారు. వివరాలు ఇలా..సర్వే నం.54/1లోని ప్లాట్ నం.20ను ఎల్ఐసీ ఉద్యోగి మల్లెపూల చంద్రశేఖర్‌గౌడ్ కొనుగోలు చేశాడు. ఆ తర్వాత ఆ ప్లాట్ వాస్తవానికి లేదని, నిందితుడు వేరే డాక్యుమెంట్ నంబర్ ద్వారా విక్రయించాడు. అంతకుముందు నిందితుడు మరోసారి సర్వే నం.54లోని ప్లాట్ నం.85ను బాధితుడి పేరిట రిజిస్టర్ చేశాడు. ఇది కూడా గోపాలకృష్ణకు అమ్మినట్లు తేలింది. డాక్యుమెంట్లను పరిశీలించగా నిందితుడు ఉద్దేశపూర్వకంగా మోసం చేశాడని, నకిలీ పత్రాల తయారీ, నకిలీ పత్రాలను అసలైనవిగా ఉపయోగించినట్లు నిర్ధారణ అయింది. బాధితుడి ఫిర్యాదుతో సోమవారం సాయంత్రం శివాజీ చౌక్ వద్ద నిందితుడిని అదుపులో తీసుకున్నారు. జడ్జి ఎదుట హాజరుపర్చగా, 15 రోజులు జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు సీఐ పేర్కొన్నారు.

కుమార్తెను వేధించిన తండ్రిపై పోక్సో కేసు

మంచిర్యాలక్రైం: కుమార్తెపై లైంగిక దాడికి పాల్పడిన తండ్రిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..జిల్లాకేంద్రంలోని హమాలివాడకు చెందిన గౌతమ్ కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. ఈయనకు భార్య, మైనర్ కుమార్తె ఉంది. ప్రతిరోజూ కుమార్తెను లైంగికంగా వేధించేవాడు. భార్య పేరిట ఉన్న ఇల్లు తన పేరిట చేయాలని ఆమెతో గొడవపడేవాడు. ఈవిషయంలో పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ జరిగినా పద్ధతి మార్చుకోలేదు. బాధితురాలి ఫిర్యాదుతో సోమవారం గౌతమ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గోదావరి మింగింది..

- బాసర వద్ద నదిలో మునిగి ఇద్దరు మృతి
- అందరూ చూస్తుండగానే జల సమాధి
- మహారాష్ట్రకు చెందిన 11 ఏళ్ల బాలుడు
- నిజామాబాద్ జిల్లాకు చెందిన మరోవ్యక్తి..


కుల్దీప్ బాలసాహెబ్ దేశ్‌ముఖ్ మృతదేహం


బొల్లమల రాజు మృతదేహం

భైంసా: నిర్మల్ జిల్లా బాసరలో గోదావరి సోమవారం ఇద్దరిని మింగింది. పుణ్యస్నానాలకు వచ్చిన 11 ఏళ్ల బాలుడు, 40 ఏళ్ల వ్యక్తి మృతిచెందారు. అంతా చూస్తుండగానే ఆయుష్షు తీరిపోయింది. స్థానికులు, బంధువుల కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని పర్భని జిల్లా టాకిలి గ్రామానికి చెందిన కుల్దీప్ బాలాసాహెబ్ దేశ్‌ముఖ్ (11) తన తల్లిదండ్రులు, బంధువులతో కలిసి సోమవారం బాసరకు రైలు మార్గం ద్వారా చేరుకున్నాడు. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన ఈ కుటుంబం, పుణ్యస్నానం కోసం గోదావరి తీరానికి వెళ్లింది. ఫిల్టర్ బెడ్ సమీపంలో ఈత కొట్టేందుకు నీటిలోకి దూకిన కుల్దీప్, లోతైన నీటిలో మునిగిపోయాడు. అతనితో ఉన్న మరో బాలుడిని స్థానికులు కాపాడారు. కుల్దీప్‌ను రక్షించలేకపోయారు. కుటుంబ సభ్యులు కేకలు వేసినప్పటికీ ఫలితం లేకపోయింది. బాసర పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కళ్లముందే కొడుకును కోల్పోయిన తల్లిదండ్రుల రోదనలు అక్కడి వారిని కలచివేశాయి.

ఫంక్షన్ ముగించుకుని వచ్చిన వ్యక్తి..

నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన బొల్లమల రాజు(40) తన బంధువులతో కలిసి ఆదివారం ఇంట్లో ఒక కార్యక్రమం పూర్తి చేసుకుని, మరుసటి రోజు సోమవారం బాసరకు వచ్చాడు. కూలీపని చేస్తూ భార్య, పిల్లలను పోషిస్తున్న రాజు, అమ్మవారి దర్శనం తర్వాత గోదావరి నదిలో స్నానం చేయడానికి రెండో ఘాట్ వద్దకు వెళ్లాడు. ఈత రాకపోయినా.. కాళ్లు కడుక్కుంటానని నీటిలోకి దిగాడు. బంధువులు హెచ్చరించినా పట్టించుకోలేదు. ఈ క్రమంలో అందరూ చూస్తుండగానే లోతైన నీటిలో మునిగిపోయాడు. గజ ఈతగాళ్లు గాలింపు చేపట్టినా మృతదేహం లభించలేదు. చివరకు అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీశారు. రాజు భార్య స్వరూప ఫిర్యాదు మేరకు బాసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోస్టుమార్టం తర్వాత మృతదేహాలు అప్పగింత ఇద్దరు మృతదేహాలను భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఒకే రోజు గోదావరి నదిలో ఇద్దరు భక్తులు జలసమాధి అవడం స్థానికులను తీవ్ర కలవరానికి గురిచేసింది.